


అతని ముఖంలోకి ఆశ్చర్యంగా చూసింది కాదంబిని. ఆ తర్వాత తల క్రిందకు దించుకుంది. ఆమెలో సన్నగా వణుకు పుట్టింది. భారంగా అతనికి వినిపించకుండా నిట్టూర్చింది.

అదేం పట్టించుకున్నట్లు లేదు శత్రుంజయరావు.

“ఏమంటారు” అని మాత్రం రెట్టించి అడిగాడు.

గుండె రాయిచేసుకుంది కాదంబిని. అందుకే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తల ఊపింది.

“అలాగే...నాకు అభ్యంతరం లేదు. కాని...కానీ...” సంశయించింది.

“ఫర్వాలేదు. చెప్పు...” అన్నాడు శత్రుంజయరావు.

“ఆ తర్వాత ఉద్యోగంమాత్రం...”

“అదా భయం...ఎంతమాత్రం అనుమానం లేదు...పోనీ...ఒక పనిచేద్దాం...ముందుగానే నీకు ఉద్యోగం ఇస్తాను...ఆ తర్వాతే...”

కాదంబిని కళ్ళల్లో మెరుపు మెరిసింది.

“నిజంగా...థాంక్స్...” అంది.

ఆమె అందాన్ని చూస్తూ ఉండిపోయేడు.

“నా అర్హతలు చెప్పాను కదూ... నాకు తగిన ఉద్యోగమే...”

“అలాగే... ఒక చిన్న గుమాస్తా ఉద్యోగం ఖాళీగా వుంది... ఎవరైనా తెలిసినవాళ్ళకు ఇయ్యాలని అనుకుంటున్నాను. ఇంతలో నాకు తెలియనిదానవు నువ్వు వచ్చావు. అయితే ఏంలే... నా కండీషన్ ఒప్పుకున్నావు కనుక నువ్వు నాకు తెలిసినవాళ్ళకంటే ఎక్కువ...” అన్నాడు శత్రుంజయరావు.

“అర్డరు...” అంటూ మధ్యలోనే ఆగిపోయింది కాదంబిని.

“అక్కర్లేదు... ఈ కంపెనీకి నేను మహారాజులాంటి వాడిని... సర్వహక్కులూ నావే...ఎవరికైనా ఉద్యోగం ఇయ్యగలను. కోపం వస్తే ఎప్పుడయినా సరే ఉద్యోగంలోంచి తొలగించనూ

గలను... రేపట్నుంచి వచ్చెయ్యి... పనిలో చేరు..."

కాదంబిని మనసు కృతజ్ఞతతో నిండి పోయింది.

"మీరు చాలా మంచివారు...నా కష్టం తెలుసుకుని ఉద్యోగం ఇస్తున్నారు... నిజంగా నేను మిమ్మల్ని కలియడం నా అదృష్టం. ఈ రోజు నాకు చాలా సుదినం ....నా కుటుంబం ఇకముందు ఆకలి బాధ పడకుండా రెండుపూటలూ తినగల్గుతాం" అంది సంతోషంగా.

నవ్వాడు శత్రుంజయరావు.

"నేను మంచివాడినా?... నా కండీ షన్ విన్నాకకూడా నన్ను మంచివాడని పొగుడుతున్నందుకు చాలా ఆశ్చర్యంగా వుంది నాకు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇక వేరే దారిలేక అంగీకరించావు కనుక నా పట్ల నీకు కోపం కలగాలి. కానీ..."

అతని మాటల్ని మధ్యలో నే త్రుంచింది కాదంబిని.

"ఫర్వాలేదు... మనసు రాయిగా మార్చుకున్న తర్వాత ఇలాంటివన్నీ పట్టించుకోకూడదు. లోకం దృష్టిలో తప్పుకావచ్చు. కానీ మావాళ్ళ ఆకలిబాధ తీర్చగల్గుతున్న మీరు మాకు అన్నదాత. అలాంటప్పుడు నా మనసు చంపుకుని మీ ఆకలి తీర్చలేనా?..."

కళ్ళు విప్పార్చి ఆశ్చర్యంగాచూశాడు శత్రుంజయరావు ఆమెవైపు.

అతను గుర్తించగల్గితే-ఆమె కళ్ళలో తడి, మనసులోని అలజడి, గొంతులోని సన్నని వణుకు వున్నాయి.

ఆమె మళ్ళీ అంది-

"చెప్పాను కదా... నా తమ్ముళ్ళ కోసం, చెల్లాయిలకోసం, భర్త పోయిన బాధతో కుమిలిపోతున్న నా తల్లికోసం ఈ ఉద్యోగం చెయ్యక తప్పదు. ఇంట్లో పెద్ద కూతుర్ని నేను...అన్నయ్యవుంటే ఈ బరువు వాడిదయ్యేది...కానీ ఇప్పుడు నేను ఆ బరువు మొయ్యాలి... నేను నాశనం అయినా ఫర్వాలేదు...నా వాళ్ళు చల్లగా ఉండాలి..." అంది కాదంబిని.

శత్రుంజయరావు మనసులో ముల్లు గుచ్చుకుంది.

తన కుటుంబం కోసం ఆమె ఎంత త్యాగానికి సిద్ధపడింది, తన కోరికమీద ...ఒక ఆడపిల్ల అయివుండీ కూడా కుటుంబ బాధ్యత స్వీకరించడానికి సిద్ధ పడింది. తను పెద్ద కొడుకు అయివుండీ తన తల్లిదండ్రులను చూస్తున్నాడా?

"సరే...రేపువచ్చి జాయిన్ కండి..." అన్నాడు.

కాదంబిని లేచి వినయంగా నమ స్కారం చేసి వెళ్ళిపోయింది.

శత్రుంజయరావు సీట్లో చిరాగ్గా కది లాడు.

అతనికి తల్లిదండ్రులు గుర్తుకు వచ్చారు.

* * *




శత్రుంజయరావు పదోక్లాసు చదువుతుండగా అతని తల్లి గుండెపోటుతో మరణించింది అతని తర్వాత ఇంకా అయిదుగురు పిల్లలు. ఆఖరిదానికి నాలుగేళ్ళు. ఒక ఏడాది తర్వాత అతని తండ్రి కాంతారావు ఒక విధవను పెళ్లి చేసుకున్నాడు. ఆమెపేరు అన్నపూర్ణ. తండ్రి పెళ్లిచేసుకోవాలని నిర్ణయించుకున్న రోజు పెద్ద యుద్ధం జరిగింది తండ్రితో అతనికి.

"ఒరేయ్: అన్నపూర్ణ ఎవరో కాదు. నా చిన్ననాటి స్నేహితురాలు. ఆమెకు భర్త పోయాడు. నా అన్నవాళ్ళు ఎవ్వరూ లేక ఒంటరిగా బ్రతుకుతోంది ఆమెను ఆదుకోవాలన్న కోరిక. ఇంట్లో పిల్లల్ని చూసుకుందుకు ఒక మనిషి వస్తుందన్న ఆశ-ఇవే నన్ను అన్నపూర్ణను పెళ్లి చేసుకునేలా చేస్తున్నాయి. నీ అంత కొడుకు ఉండగా తండ్రి పెళ్లిచేసుకోవడం కాస్త విడ్డూరంగాను, నీకు చిన్నతనంగానూ అనిపించవచ్చు. ఒకరి గురించికాక మనం మనకోసం బ్రతకాలి. అన్నపూర్ణ చాలా మంచిది. ఆ విషయం నీకు త్వరలో తెలుస్తుంది." అన్నాడు కాంతారావు.

"అక్కర్లేదు. సవతితల్లుల గురించి చాలా కథల్లో చదివాను. నా బెంగ నా గురించి కాదు. నా తమ్ముళ్ళ గురించి, చెల్లాయిల గురించి...వాళ్ళని రాచి రంపాన పెడితే మీకు బాధ కలగదేమోకానీ నేను మాత్రం భరించలేను" అన్నాడు పుల్లవిరుపుగా శత్రుంజయరావు.

"అన్నపూర్ణ గురించి తెలియని నువ్వు అలా అనుకోవడంలో తప్పు లేదు...కానీ...ఊహలు అన్నీ తప్పుగా ఋజువవుతాయి"

"నువ్వు చాలా స్వార్థపరుడివి నాన్నా! అమ్మను ఇంత త్వరగా మరచిపోతావని అనుకోలేదు" కోపంగా అన్నాడు

"మీ అమ్మను నేను మర్చిపోయేది చితిలోనేరా...అన్నపూర్ణకు చేయూత ఇయ్యాలన్న ఆశ నన్ను పెళ్లిచేసుకునేలా చేస్తోంది కానీ నువ్వు అనుకుంటున్నట్లు నేను మీ అమ్మను మర్చిపోలేదు. తుచ్ఛమైన వాంఛలకు లొంగిపోలేదు."

శత్రుంజయరావు ఇష్టానికి వ్యతిరేకంగా అన్నపూర్ణ ఆ ఇంట్లో యిల్లాలుగా అడుగుపెట్టింది. ముందునుంచీ పెంచుకున్న ద్వేషంవల్ల శత్రుంజయరావు ఆమెను గౌరవించలేకపోయాడు. అన్నపూర్ణ ప్రేమతో పిల్లల్ని సాకుతుంటే అదంతా నటన అని పొరపడేవాడు. తనతో మాట్లాడబోతే కసురుకునేవాడు. అప్పటినుంచే అతనికి తండ్రి, కొత్త తల్లి అంటే అసహ్యం ఏర్పడింది. అంటీఅంటనట్లు కాలం గడిపేవాడు. అన్నపూర్ణకు గల లోపంవల్ల ఆమెకు గతంలో పిల్లలు లేరు. ఇప్పుడు పుట్టబోరు.

కాలేజీ చదువు కోసం ఆ యింటి నుండి బయటకు వచ్చేశాడు. శలవుల్లో కూడా ఇంటికి వెళ్ళకుండా తప్పించుకునేవాడు. తనకు ఎవ్వరూ లేరు-ఒంటరిగాడు-అన్న భావం పెంచుకోసాగాడు. అన్నపూర్ణని పొగిడినందుకు అతని తమ్ముళ్ళనీ, చెల్లాయిలనీ కూడా అసహ్యించుకోసాగాడు.

కాలేజి చదువు పూర్తి అయ్యింది. అదృష్టవశాత్తు మంచి ఉద్యోగం దొరికింది. అప్పుడే కాంతారావు రిటైర్ అయిపోయాడు.

"ఇక వీళ్ళ బరువుబాధ్యతలు నీవేరా" అన్నాడు కొడుకుతో.

"లేదు నాకు ఏ రకమైన సంబంధమూ లేదు. నా నుంచి ఏ సహాయమూ ఆశించకండి. మీరు ఏ రోజైతే నా ఇష్టానికి వ్యతిరేకంగా పెళ్ళిచేసుకున్నారో ఆ రోజే మీరు నాకు దూరం అయ్యారు. గత్యంతరం లేక మీ డబ్బుతో చదివాను, ఇప్పుడు నేను స్వతంత్రుడివి. నన్ను యాచించకండి" అన్నాడు గట్టిగా నిష్కర్షగా.

కొన్ని రోజుల తర్వాత అన్నపూర్ణ ఉత్తరం రాసింది.

"బాబూ నన్ను అసహ్యించుకుంటున్నావని తెలిసినా ఉత్తరం రాయక తప్పడంలేదు. మీ నాన్నగారి ఆరోగ్యం దెబ్బతింది. పిల్లల బాధ్యత మరోవైపు నుంచి ఆయన్ని బాధిస్తోంది. భగవంతుని దయవలన చిన్న వయసులోనే పెద్దఉద్యోగం చేస్తున్న అదృష్టం నీది. మీ నాన్నగారి బరువులో కొంతవరకైనా బాధ్యత స్వీకరించమని కోరుతున్నాను"

ఆ ఉత్తరాన్ని కసిగా చించి ముక్కలు చేశాడు, తను ఎందుకు




బాధ్యత వహించాలి? భరించలేమన్న జ్ఞానం పోగొట్టుకుని అందరు పిల్లల్ని తను కనమని చెప్పాకా? ఏరోజు తన ఇష్టానికి వ్యతిరేకంగా ఆయన ప్రవర్తిం చాడో ఆరోజే తన మనసులోంచి వెళ్లి పోయాడు. తనకు చదువు చెప్పించ డంలో వాళ్ళేదో ఘనకార్యం చేశారను కుంటే అది పొరపాటు. తండ్రిగా ఆయన తన బాధ్యత నిర్వహించాడు అంతే.

ఆ ఉత్తరానికి జవాబు రాయకుండా బిర్రబిగుసుకుని శిలలా ఉండిపోయాడు.

రెండుచేతులా సంపాదిస్తున్న వేలాది రూపాయలతో భోగాలు అనుభవిస్తూ ఉండిపోయాడు. తనకు పెండ్లి తండ్రే చెయ్యక్కర్లేదు. నచ్చిన అమ్మాయి కోసం తనే వెతుక్కుంటున్నాడు. అన్వే షణ ఫలించిన రోజున తండ్రికి కూడా చెప్పకుండా వివాహం చేసుకుంటాడు.

మరొక నెలరోజులు గడిచాయి.

అతని తర్వాతవాడు వచ్చాడు, అన్న గారితో స్వయంగా మాట్లాడాలని.

"ఏరా? వాళ్లిద్దరూ నిన్ను రాయబారా నికి పంపేరా?" అడిగాడు వెటకారంగా.

కాదన్నట్లు తల తిప్పాడు భోగరాజు.

"వాళ్ళకు తెలియకుండా వచ్చాను, తెలిస్తే నన్ను రానియ్యరని నాకు తెలుసు. ఇంత అనారోగ్యంలోనూ ఏదో దుకాణంలో పద్దులు రాయడానికి కుదిరేడు నాన్న. నేను చదువు మానే శాను. ప్రస్తుతం సినిమా హాల్లో టిక్కట్లు అమ్ముతున్నాను. నీ దగ్గర్నుంచి జవాబు లేకపోయినా నాన్న గుండె రాయిచేసు కున్నాడు, అమ్మకూడా బాధపడని క్షణం లేదు" అన్నాడు భోగరాజు.

తోక తొక్కిన తాచులా లేచాడు శత్రుంజయరావు.

"ఎవత్తిరా అమ్మ? సవతి తల్లిని తెచ్చి నెత్తిమీద పెట్టుకుని అమ్మ అన డానికి సిగ్గులేదూ?"

చిన్నగా నవ్వాడు భోగరాజు.

"అమ్మకు దూరం కావడం నీ దుర దృష్టంరా. మన అమ్మకంటే ఎక్కు వగా చూసుకుంటుంది ఈ అమ్మ. అందుకే అమ్మ అంటాను. సవతి తల్లు లంతా ఒకేలా వుంటారా? ముందునుంచి నువ్వు అనుకోవడం వల్ల అలా అనిపి స్తోంది నీకు. ఎవరో చెప్పారని ఒక వంటకం రుచి ఫలానా కాబోలు అని ఊహించుకుని అజ్ఞానంలో వుండి పోయావు. కాని నీ ఊహ తప్పు. ఆ వంటకం రుచి ఫలానాగా లేదు. చాలా బాగుంది"

"నోర్ముయ్-ఇంతకీ ఎందుకు వచ్చావు?"

"పెద్ద ఆఫీసరువి కదా-నాకు ఏదైనా ఉద్యోగం చూపించకపోతావా అన్న ఆశతో వచ్చాను. అమ్మానాన్నల బాధ్యత నువ్వు తీసుకోవటం లేదు కనుక నేను తీసుకుందుకు సిద్ధం అయ్యాను. ఈ ఒక్క సహాయం చెయ్యి."

"నాదగ్గర ఉద్యోగాలు ఏమీ లేవు. వెళ్ళు..."

"పోనీ నీకు తెలసినవాళ్ళదగ్గర..."

"అక్కడా లేవు."

"ఇప్పుడు అర్థం అయ్యింది...నాకు సహాయం చేస్తే అది ఇండైరెక్టుగా అమ్మానాన్నలకు సహాయం చేసినట్లే. అందుకే నువ్వు చెయ్యదల్చుకోలేదు. అవునా?" మాట్లాడలేదు శత్రుంజయ రావు

"సరే వస్తాను అన్నయ్యా... అమ్మా నాన్నలను ఏదో విధంగా నేను ఆదుకో గలను. నాకు ఆ నమ్మకం ఉంది. కానీ ఎందుకో ఒకే తల్లికడుపున పుట్టిన నిన్ను చూస్తే జాలివేస్తోంది. మెట్లన్నీ ఎక్కి మేడ ఎక్కినవాడు మెట్లగురించి మర్చిపోకూడదు. కనీసం ఈ విషయం గుర్తుంచుకో" అంటూ వెళ్ళిపోయాడు, భోగరాజు.

ఇది జరిగి కూడా రెండు నెలలు అయ్యింది.

వాడికి ఎక్కడైనా ఉద్యోగం వచ్చిందో లేదో పట్టించుకోలేదు. తన తల్లిదండ్రులు తింటున్నారోలేదో తనకు అక్కర్లేకపోయింది. ఆ విషయాలే మర్చిపోయాడు.

ఈరోజు కాదంబిని ఉద్యోగంకోసం అన్ని ఆఫీసుల చుట్టూ తిరుగుతూ తన దగ్గరకూ వచ్చింది. ఆమె అందం చూడ గానే అతని మనసు వశం తప్పింది.

అందుకే ఒక కండిషన్ పెట్టి ఆమెకు ఉద్యోగం ఇస్తానన్నాడు. ఆమె అంగీక రించింది.

తనతో ఒక రాత్రి గడపడానికీ, తనకు ఆ అందాలు అందించడానికీ అంగీకరించింది. ఎందుకని?

కొడుకులు పెద్దవారు కాని కారణంగా తల్లికి కొడుకులేని లోటు తీర్చాలని, అకస్మాత్తుగా తండ్రిపోతే ఆ ఇంటికి వచ్చే ఆదాయం ఆగిపోతే కడుపునిండా తిండికి నోచుకోని తన సహోదరులకు ఇంత భోజనం పెట్టాలని.

తనని తాను అర్పించుకుందుకు సిద్ధం అయ్యింది. ఆమెకు కుటుంబ శ్రేయస్సే కావాలి కానీ తన బాగు కాదు.

మరి తనకో?

తన బాగు కావాలి కానీ కుటుంబ శ్రేయస్సు కాదు.

ఒక ఆడపిల్ల అంత త్యాగానికి సిద్ధం అయ్యింది. తను మగవాడు అయి ఉండీ, బాధ్యత స్వీకరించడానికి వెనుకంజ వేశాడు.

తండ్రి ఏదో చేశాడని తను తన బాధ్యతని నిర్వహించకపోవడం ఏం సమంజసం? తనకంటె వయసులో, అర్హతలో, హోదాలో, స్థాయిలో కాదంబిని చిన్నదే కావచ్చు. కానీ ఈ రోజు తనకే పాఠాలు నేర్పింది. బాధ్యత గలవారు ఎలా ప్రవర్తించాలో తెలియచెప్పింది. తన హోదా, వయసు, అర్హత-అన్నీ ఆమెముందు ఎందుకూ పనికిరావు. తను ఆమెదగ్గర పాఠాలు నేర్చుకొన్నాడు కనుక ఆమె తనకు 'పంతులమ్మ'.

తల్లిదండ్రులను కన్నబిడ్డలు కాకపోతే ఇంకెవరు చూస్తారు? తల్లిదండ్రులను ఆదుకోవడం, కట్టుకున్న భార్యకు తిండిపెట్టడం-ఊరికి ఉపకారం అనుకుంటే ఎలాగ?

'కాదంబినీ నిన్ను చూసి నా తప్పు తెలుసుకున్నాను...నీ మంచితనం చూసి గర్వపడుతున్నాను. నేను కూడా సరైన దారిలో పయనించి, తలఎత్తుకు తిరుగుతాను. ఈరోజు నువ్వు నాకు పరిచయం కావడం నా అదృష్టం...' అనుకున్నాడు.

అన్ని రోజులుగా అతని మనసులో స్థానం సంపాదించుకోలేకపోయినా తల్లిదండ్రులు ఆరోజు అతని మనసునిండా వుండియారు.

ఒక రకంగా శతృంజయరావు ఆ రోజే నిజమైన శతృంజయరావు అయ్యాడు.

తనలోని స్వార్థం, తనవారిపైగల అసహ్యం అనే శతృవులిద్దర్నీ చిత్తుచేసి ఓడించి తనుమాత్రం శతృంజయరావు అయ్యేడు.

తను ఏం చెయ్యాలో ఆలోచించి నిర్ణయించుకున్నాడు.

అతనికి ఏనాడూ కలగని సంతోషం ఆరోజు కలిగింది.

* * *

"గుడ్ మార్నింగ్ సార్..." అంది కాదంబిని ఛాంబర్‌లోకి వస్తూనే.

శత్రుంజయరావు తలఎత్తి చూసి చిరునవ్వు నవ్వాడు.

"గుడ్‌మార్నింగ్... కూర్చోండి" అన్నాడు. ఆమె కూర్చుంది.

బెల్ నొక్కి, వచ్చిన ప్యూనుతో ఎవర్నో పిలవమని చెప్పాడు,

రెండునిముషాల్లో ఒకాయన వచ్చాడు. సుమారు యాభై సంవత్సరాలుంటాయి.

"చూడండి లక్ష్మణరావుగారూ ... మీరు ఒక గుమాస్తా కావాలని చెప్పారు కదూ ఆ మధ్య...ఇదిగో...ఈమె మిస్ కాదంబిని...ఈమెను నియమించాను... సీటుచూపించి పని చెప్పండి...ప్రస్తుతం కొత్త...నెమ్మదిగా అలవాటు అవుతుంది లెండి..." అన్నాడు.

ఆయన తలఊపుతూ "సరే సార్ ..." అన్నాడు.

"ఈయనతో వెళ్ళండి..." అన్నాడు కాదంబినితో. ఆమె లేచింది.

ఇద్దరూ కలిసి వెళ్ళిపోయారు.

మరొక గంట తర్వాత లక్ష్మణరావు గారిని పిలిచేడు.

పర్సుతీసి ఎనిమిదివందలు తీశాడు.

"ఈ ఎడ్రస్‌కు M. O. చెయ్యండి.." అంటూ ఒక కాగితం ఇచ్చాడు. ఆయన ఆ కాగితం, డబ్బు తీసుకుని వెళ్ళి పోయాడు. ఆయన ఆ ఎడ్రసు చదవలేదు కానీ చదివివుంటే అది శత్రుంజయరావు తండ్రిదని తెలుసుకునేవాడు.

ఆ తర్వాత ప్యూన్‌ని పిలిచి ఒక కవరు ఇచ్చి పోస్టుచెయ్యమన్నాడు.

ప్యూను వెళ్ళి పోస్టుచేసి వచ్చాడు. పోస్టుబాక్సుకు చదవడం రాదుకానీ వచ్చి వుంటే అది భోగరాజుకి రాసిన వుత్తరం అనీ, ఆ ఉత్తరంలో భోగరాజు తిరిగి కాలేజీలోచేరాలని అతను రాసినట్లు చదివి వుండేది... ఆ కుటుంబ బాధ్యతలు అతను స్వీకరిస్తున్నట్లుకూడా చదివి వుండేది.

సాయంత్రం నాలుగు గంటలకు కాదంబినికి కబురుపెట్టాడు. అందరూ వెళ్ళిపోయాక ఒకసారి తన ఛాంబర్‌లోకి వచ్చి ఆమె కలుసుకోవాలని.

ఆఫీసు అయిపోయేక కాదంబిని ఛాంబార్‌లోకి వచ్చింది.

"కూర్చోండి..." అన్నాడు.

శత్రుంజయరావును ఆమె అర్థంచేసు కోలేకపోతోంది. ఒకసారి బహువచ నంలో సంభోధిస్తాడు... ఒకసారి ఏక వచనంలో...

ఆమె కూర్చుంది. అతను తల ఎత్త కుండా ఏవో కాగితాలు చూసుకుంటు న్నాడు.

"ఈ రాత్రి... మీ ఇంటికి రమ్మం టారా లేక మరెక్కడైనా..." ఆ తర్వాత ఏం మాట్లాడాలో తెలియక ఆపేసింది.

తలఎత్తి చూశాడు అతను... అతని కళ్ళల్లో ఆమె చదవగలిగితే పశ్చాత్తాపపు ఛాయలు...




అతను లేచి నిలబడ్డాడు. ఆమెను సమీపించాడు. ఆమెకూడా లేచి నిలబడింది.

ఆమె కుడిచేతిని తన ఎడమచేతిలోకి తీసుకున్నాడు.

కాదంబినిలో ఏదో కలవరం... ఆ క్షణం వస్తుందని తెలిసినా ఎందుకో ఆమెలో బేలతనం ఒక్కసారిగా పొంగింది ఆ క్షణంలో.

ఇదేమిటి...అతను... ఇక్కడే...

ఆ తర్వాత జరిగిన సంఘటనకు ఆశ్చర్యపడింది.

ఆమె చెయ్యి అతని చెంపపై నాలుగైదుసార్లు గట్టిగా తాకింది...

లేదు... ఆమెచేత చెంపదెబ్బలు కొట్టించుకుంటున్నాడు అతను... ఆమె తనంత తాను అలా చెయ్యదు కనుక అతను తన ఎడంచెయ్యి అందుకు వాడుతున్నాడు

జరుగుతున్నది గ్రహించి ఆమె తన చెయ్యి విడిపించుకుందుకు ప్రయత్నించింది. కానీ అతని బలం ముందు ఆమె ఓడిపోయింది. అలా మరో పదిదెబ్బలు తిన్నాడు.

"నా పశువాంఛకు క్షమించు...వెళ్ళిపో. .నీ ఉద్యోగానికి ఏం ఢోకాలేదు... ఈ విషయం మర్చిపో..." అంటూ అతను తన తలను చేతుల మధ్య దాచుకున్నాడు.

ఆమె అతన్ని ఆశ్చర్యంగా చూసింది. అతను 'కామం' అనే శత్రువుని కూడా జయించిన శత్రుంజయరావు. *